క్లుప్తంగా

విద్యార్థి దశ నుండి క్రమశిక్షణతో నడవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ జావీద్

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే పిల్లలు క్రమశిక్షణతో నడుచుకోవాలని కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జావేద్ సూచించారు. ముఖ్యంగా మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇచ్చి వారు ప్రమాదాలకు గురికాని వ్వద్దని ఆయన సూచించారు. సోమవారం కడప మరియాపురం వద్ద ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ద్విచక్ర వాహనాల కన్నా సైకిల్‌లలో పాఠశాలకు వస్తే వ్యాయామం చేసినట్టు ఉంటుందని, దీంతో పాటు ఆరోగ్యంగా కూడా ఉంటుందని సూచించారు. విద్యార్థి దశ నుండి ట్రాఫిక్‌పై అవగాహన ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకుడు సయ్యద్ గౌస్ పీర్, ఆర్ ఆర్ సంస్థ అధ్యక్షులు అబ్దుల్ షేక్ రాయల్ కరీముల్లా పాల్గొన్నారు.

నీటి వనరుల నిర్వహణ పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

కడప ఎడ్యుకేషన్: గ్రౌండ్ వాటర్ రిసోర్స్ మానేజిమెంట్ అండ్ ప్లానింగ్ స్ట్రాటజీస్: ఏ జియో స్పేషియల్ అప్రోచ్: వాల్యూం 1 అనే పుస్తకాన్ని వైవీయూ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. పుస్తక రచయిత భూగర్భ శాస్త్రం విభాగపు హెడ్ ఆచార్య వంగల సునీత బృందాన్ని అభినందించారు. సోమవారం తన చాంబర్‌లో జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆచార్య వంగల సునీత రాసినా ఈ పరిశోధన పుస్తకం స్ప్రింగర్ నేచర్ వాటర్ బుక్ సిరీస్ లో ప్రచురితం కావడం ప్రశంసనీయమన్నారు. ఈ పుస్తకం రచయిత సునీత మాట్లాడుతూ ఈ పుస్తక రచన పరిశోధనలో తనతో పాటు బండి మురళీధర రెడ్డి, మన్నల ప్రసాద్, వై. సుదర్శన రెడ్డి, బడపల్లి ప్రదీప్ కుమార్ బాలాజీ ఇటికల ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాస్, జియాలజీ ఆచార్యులు రఘుబాబు, జయరాజు, డా.శ్రీనివాస గౌడ్, పీఆర్ సెల్ డైరెక్టర్ సరిత పుస్తక రచయితను అభినందించారు.

కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కరువు

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్రంలోని ప్రజలకు కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు కరువయ్యాయని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 27వ డివిజన్ గౌస్ నగర్‌లో ఇంటింటి కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు ప్రతి ఇంటిలోను సంక్షేమ పథకాలు అందకపోవడం వలన ప్రజలు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ ఇన్చార్జ్ షామీర్ హుస్సేన్, క్రిస్టియన్ మైనారిటీ ప్రెసిడెంట్ సంజయ కాంత, గంగయ్య, డివిజన్ ఇంచార్జిలు యూసఫ్, ఫజల్లుల్లా, కరీం, కరిముల్లా, ముబారక్, సిద్దిక్ పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ



పుస్తకాల ఆవిష్కరణ చేస్తున్న కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని అప్సర్ కాలనీలో ఉన్న కార్యాలయంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విశ్వ కారుణ్య మూర్తి ప్రవక్త మొహమ్మద్ (సల్లెల్లాహు అలైహి వసల్లం) జీవిత చరిత్రపై రాత పరీక్ష ఉచిత పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎఫ్ ఎం ముక్తార్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 11 సంవత్సరాల నుండి తమ సొసైటీ ఆధ్వర్యంలో మొహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రపై రాత పరీక్ష పోటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా సెప్టెంబర్ నెల 21వ తేదీ ఉర్దూ, ఇంగ్లీష్, తెలుగు భాషలలో రాత పరీక్ష పోటీలు నిర్వహించబోతున్నామని, అందుకోసం మొహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రకు సంబంధించిన అంశాల ఉచిత పుస్తకాలను ఆవిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా, ధర్మ పరిచయ కమిటీ డైరెక్టర్ సయ్యద్ అహ్మద్ బాబు భాయ్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆదాయానికి గండి

- ఎక్కడ చూసినా ఎమ్మెల్యే ఫ్లెక్సీలే
- ఇతర పార్టీలు ఫ్లెక్సీలు పెట్టాలంటే చలానా కట్టాల్సిందే
- అధికార పార్టీకో న్యాయం... ఇతరులకో న్యాయమా...?



కడప నగరంలో ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, హోర్డింగులు

కడప కార్పొరేషన్: కడప శాసనసభ్యురాలు, ప్రభుత్వ విప్ ఆర్. మాధవి జన్మదిన సందర్భంగా వారం రోజుల ముందే నగరమంతా ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్లు వెలిశాయి. ఆమె జన్మదినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశాయి. అయితే నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులకు కడప నగరపాలక సంస్థకు చలానా రూపంలో నయాపైసా కూడా అడ్వర్‌టైజ్‌మెంట్ ట్యాక్స్ చెల్లించపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో టీడీపీ మహానాడు సందర్భంగా కూడా ఇదే రీతిలో ఇతర రాష్ట్రాల నుంచి, ప్రాంతాల నుంచి మనుషులను తెప్పించి భారీ స్థాయిలో హోర్డింగులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అప్పుడు కూడా కడప కార్పొరేషన్‌కు ఒక్క రూపాయి కూడా చలానా చెల్లించలేదు. అధికార పార్టీ నేతలు కాకుండా ఇతరులు ఎవ్వరు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా నగరపాలక టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటిని వెంటనే తొలగించేస్తున్నారు. చలానా కట్టని ఎవరి ఫ్లెక్సీలను కూడా అనుమతించడం లేదు. కానీ టీడీపీ నాయకులు కట్టే ఫ్లెక్సీలను తాకే సాహసం కూడా చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

– గతంలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీల అగ్రనాయకుల జన్మదినాలు, కార్యక్రమాలు ఉన్నప్పుడు అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే మూడు రోజులపాటు ఉంచి తొలగించేవారు. కాగా ఈనెల 29వ తేది ఎమ్మెల్యే జన్మదినం కాగా వారం రోజుల ముందే 23 తేదీనే ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మరో మూడు రోజులు ఎలాగూ ఉంచుతారు. ఈ లెక్క సుమారు పది రోజుల పాటు ఎమ్మెల్యే ఫ్లెక్సీలను తాకేవారు ఉండరు. ఇదిలా ఉండగా ఈనెల 27వ తేది కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి జన్మదినం ఉంది. ఆయన జన్మదిన సందర్భంగా పార్టీ నాయకులు, అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలంటే చలానాలు కట్టనిదే టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతించలేదు. అధికార పార్టీ నాయకులకైతే సాగిలపడి అనుమతించడం పట్ల ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అధికార పార్టీకో న్యాయం...ఇతరులకో న్యాయమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అందరికీ ఒకే నిబంధన వర్తింపజేసి ఉంటే కడపలో ఎమ్మెల్యే తాలూకా వ్యక్తులు ఏర్పాటు చేసిన సుమారు 200లకు పైగా ఫ్లెక్సీలు, హోర్డింగులకు కార్పొరేషన్‌కు చలానా రూపంలో కనీసం లక్ష రూపాయల వరకైనా ఆదాయం సమకూరేది.

కమిషనర్‌నే అడగండి– సీపీ

తెలుగుదేశం పార్టీ నాయకులు కడపలో కట్టిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, హోర్డింగులకు ఎంత చలానా కట్టారని సిటీ ప్లానర్ శైలజను వివరణ కోరగా...కమిషనర్‌నే అడగాలని సూచించారు. దీన్నిబట్టి టీడీపీ నేతలు ఎవ్వరూ చలానాలు చెల్లించలేదని....కమిషనర్ ఆధ్వర్యంలోనే ఇదంతా జరుగుతోందని భావించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వినాయక మండపాల వద్ద నిబంధనలు తప్పనిసరి



సూచనలు ఇస్తున్న కడప టూటౌన్ సీఐ గంటా సుబ్బారావు

కడప అర్బన్: కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక మండపాలు ఏర్పాటు చేసిన సభ్యులతో పోలీసు స్టేషన్‌లో సీఐ గంటా సుబ్బారావు సోమవారం సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. వినాయక చవితి మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అశ్లీలనృత్యాలు మండపాల సమీపంలో చేయరాదని, అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.రాత్రి 10 గంటలు దాటిన తర్వాత ఎలాంటి డీజేలు మైకులు పెద్దపెద్ద సౌండ్ పెట్టరాదన్నారు. కుల మతాలకు అతీతంగా వినాయక చవితి పండుగను జరుపుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం జరిగే రోజు డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించరాదన్నారు. చిన్నపిల్లలను నిమజ్జనం వద్దకు తీసుకువెళ్లరాదన్నారు. నిమజ్జనం చేసేవారు ముందుగా వారి రూట్ మ్యాప్ పోలీసులకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. మనం చేసే పండుగ మంచి కోసమై ఉండాలి కానీ చెడు కార్యక్రమాలకు, గొడవలకు దారి తీయకూడదన్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా తమకు సమాచారం ఇస్తే తాము పరిష్కరించడానికి తమ సిబ్బందితో కలిసి అన్ని విధాల సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిద్దయ్య, ఏఎస్ఐ సుధాకర్, సిబ్బందితో పాటు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు వాడాలి



మట్టి గణపతి విగ్రహాలను అందచేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కడప ఎడ్యుకేషన్: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే వాడాలని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేముల సలీంబాష పేర్కొన్నారు. సోమవారం శ్రీ కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఇండియన్ రెడ్ క్రాస్ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్‌ల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ వేముల సలీం బాష, అనంతపురం ప్రభుత్వ కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకులు జి. ఎల్. ఎన్. ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడటం వల్ల జరిగే నీటి కాలుష్యాన్ని విద్యార్థినులకు వివరించారు. హాండ్స్ ఫర్ యు వ్యవస్థాపకులు పట్టుపోగుల పవన్ కుమార్ వంద విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్. పి.శచీ దేవి, డాక్టర్ గురు మోహన్ రెడ్డి, ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి. వి.సుబ్బారెడ్డి, బాటనీ అధ్యాపకురాలు నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

కడప కార్పొరేషన్: కడప నగరంలోని 23వ డివిజన్‌లో మురళీ థియేటర్ సమీపంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు హాజరవుతున్నారని తెలిపారు.

కడప నగరంలో 412 విగ్రహాలు ఏర్పాటు

కడప అర్బన్: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని సోమవారం రాత్రి వరకు కడప నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో మొత్తం 412 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో కడప తాలూకా పరిధిలో 80 విగ్రహాలను, ఒన్‌టౌన్ పిఎస్ పరిధిలో 100 విగ్రహాలను, టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 65 విగ్రహాలను, చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 100 విగ్రహాలను, రిమ్స్ పిఎస్ పరిధిలో 67 విగ్రహాలను ఏర్పాటు చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పండుగ చేసుకోవాలని పోలీసులు సూచించారు.

29న పుస్తక పరిచయ సభ

కడప ఎడ్యుకేషన్: ఎస్ కే ఆర్ అండ్ ఎస్ కే ఆర్ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీం బాష రచించిన 'సమీచీనం' పుస్తక పరిచయ కార్యక్రమాన్ని తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా ఈనెల 29న మహిళ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ , పుస్తక పరిచయం చేసేటందుకు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం పూర్వ సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య హాజరవనున్నారన్నారు.

డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న డ్రైవర్ల కమిటీ నాయకులు

కడప కార్పొరేషన్: కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షుడు ఎస్. రవి, జిల్లా ఉపాధ్యక్షుడు కె. తిరుపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె. శ్రీరామ్, డ్రైవర్ కమిటీ అధ్యక్షుడు వి. శ్రీధర్‌బాబు కోరారు. సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలను పూర్తిస్థాయిలో రిపేరు చేయించాలని, ప్రతి వాహనంలో టూల్ కిట్ ఏర్పాటు చేయాలన్నారు. షెడ్‌లో మెకానిక్‌లను పెంచాలని, స్టాక్ రూమ్ నిర్వహణ చేయాలన్నారు. వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు సంబంధిత అధికారులు స్పందించి వాహన రికార్డులు, కేసు సంబంధించిన విషయాలు మాట్లాడి కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. డంపింగ్ యార్డ్‌లో సిసి కెమెరాలు, లైటింగ్ , భారీ గేట్లు ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పాత మున్సిపల్ ఆఫీస్‌లో కూడా సీసీ కెమెరాలు, లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. వీటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్, సహాయ కార్యదర్శి జి. ప్రకాష్, ఓబులేసు పాల్గొన్నారు.

– కడప నగరం రామాంజనేయపురం పరిధిలోని వరదకాలనీలో డోర్ నంబర్– 38/6349 నుంచి వరదకాలనీ నాలుగు రోడ్ల సర్కిల్ వరకూ తాగునీటి పైపులైన్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆ వీధిలో పైపులైన్ ఏర్పాటు చేసి, సిమెంటు రోడ్డు నిర్మించాలని కోరారు.

చెన్నంపల్లె ఎంపీపీ పాఠశాలను పునర్నిర్మించాలి

– కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : బద్వేలు మండలం చెన్నంపల్లె మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను అధునాతన వసతులతో పునర్నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బద్వేలు మండలం చెన్నంపల్లె ప్రాథమిక పాఠశాల పునర్నిర్మాణంపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బద్వేలు మండలం చెన్నంపల్లె గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గదులను కోల్పోవడం జరిగిందని అందుకు సంబంధించి.. పరిహారంగా నేషనల్ హైవే వారు అందించిన మొత్తంతోపాటు పాఠశాలకు సంబంధించిన స్థలంలో తరగతి గదుల భవనంతో టాయిలెట్స్, అధునాతనంగా నిర్మించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల భవన నిర్మాణానికి అయ్యే ఖర్చు.. అంచనా ప్రతిపాదనలు తెలియజేయాలని సమగ్ర శిక్ష అధికారులను ఆదేశించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఓబులమ్మ, ఎస్ఎస్ఏ ఏపీసీ ఎ.నిత్యానందరాజులు, ఎస్ఎస్ఏ ఈఈ గురివిరెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి, సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మాన్యం భూములపై కమిటీ రిపోర్టు రద్దుచేయాలి

– కలమల్ల గ్రామస్తుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కలమల్ల గ్రామస్తులు

కడప సెవెన్‌రోడ్స్ : ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామంలోని శ్రీ సిద్దేశ్వరస్వామి ఆలయ మాన్యం భూములపై జాయింట్ కమిటీ ఇచ్చిన రిపోర్టును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆ గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. 1943 నుంచి ఆలయం దేవాదాయ ధర్మాదాయశాఖ పరిధిలో ఉందన్నారు. దాతలు ఆలయానికి 61.50 ఎకరాల భూములు ఇచ్చారన్నారు. ఆర్టీపీపీ నిర్మాణ దశలో దాతల సహకారంతో ఆలయాన్ని పునర్నిర్మించామన్నారు. కానీ ఇటీవల కొందరు మాన్యం భూముల విషయంలో గ్రామంలో ఉన్న మరో ఆలయానికి పేరు మార్చి ఈ భూములను చూపించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఆర్డీఓ, తహసీల్దార్, జిల్లా సర్వేయర్, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ ప్రజలతో సమావేశం నిర్వహించకుండా పూర్వపు రికార్డులు పరిశీలించకుండా ఏకపక్షంగా గతనెల 14న రిపోర్టు ఇచ్చారన్నారు. ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా అధికారుల నివేదిక ఉందన్నారు. కనుక రిపోర్టును రద్దు చేసి ప్రజల మనోభావాలు గౌరవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిద్దేశ్వరస్వామి దేవస్థాన కమిటీ నాయకులు ఇల్లూరు రాంప్రసాద్‌రెడ్డి, నారపురెడ్డి తారక రామారెడ్డి, నారపురెడ్డి రమణారెడ్డి, ఇల్లూరు నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ఉపాధి కల్పన, ఆర్థిక భరోసా



కోర్సులో భాగంగా బ్యూటీ సలూన్‌ను సందర్శించిన చెమ్మియాపేట బాలికల హైస్కూల్ విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్: వృత్తి విద్యతో ఉపాధి కల్పన, ఆర్థిక భరోసా లభిస్తుందని చెమ్మియాపేట బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం గాయత్రిబాయ్ పేర్కొన్నారు. బడి నుంచి నైపుణ్య శిక్షణతో విద్యార్థులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలలో పీఎంశ్రీ తరపున వృత్తి విద్యా కోర్సులు ప్రవేశపెట్టారన్నారు. అందులో భాగంగా చెమ్మియాపేట బాలికల పాఠశాలలో బ్యూటీ అండ్ వెల్‌నెస్ కోర్సులను ప్రవేశపెట్టినట్లు వారు తెలిపారు. సోమవారం 9,10 తరగతి విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ కోసం సలూన్ ఉపయోగించే అడ్వాన్స్ మ్యాచ్‌నెరీ గురించి తెలియజేయడానికి ఇండ్రస్ట్రియల్ విజిట్‌కు తీసుకెళ్లారు. అక్కడ బ్యూటీషియన్ సుజాత హైడ్రా ఫేసియల్, హెయిర్ స్పా, హెయిర్ కట్‌ను ప్రాక్టికల్‌గా చూపించి తెలియ జేశారు. ఈ సందర్భంగా హెచ్ ఎం గాయత్రి, ఒకేషనల్ టీచర్ సురేఖ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతోపాటు వృత్తి విద్య ఎంతో అవసరం అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



డి.చంద్రశేఖర్‌రావు

జమ్మలమడుగు రూరల్ : ప్రధానోపాధ్యాయుల సమస్యల సాధనకు కృషి చేస్తానని జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చంద్రశేఖర రావు తెలిపారు. ఆదివారం డీసీఈబీ ఫంక్షన్ హాల్‌లో నూతన కార్యవర్గ ఎన్నికలలో జమ్మలమడుగు మండల విద్యాశాఖాధికారి–2 చంద్రశేఖరరావు రెండవ సారి జిల్లా ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. జిల్లా అధ్యక్షుడుగా జి.వి. సుబ్బారెడి, కోశాధికారిగా బి.శ్రీనివాస్‌రెడ్డి, జమ్మలమడుగు ఉపాధ్యక్షుడు వి. సూర్యనారాయణరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ జి.బాలయ్య, రాష్ట్ర కౌన్సిలరు ఎస్.లక్ష్మీ నారాయణ రెడ్డి తదితరులను ఎన్నుకోన్నారు.

దేశంలో లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి



ఇస్లామిక్ ఇయర్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌సీపీ నాయకులు, వైద్యులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: దేశంలో లౌకిక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ప్రముఖ గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ శ్రవణ్ కుమార్ రెడ్డి, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని వేదాంత హాస్పిటల్ ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఇస్లామిక్ ఇయర్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను వివరిస్తూ పుస్తక రూపంలో ప్రజలను చైతన్యం పరచడం కోసం ఆప్ కి ఆవాజ్ కమిటీ ఇస్లామిక్ ఇయర్ పేరు మీద ప్రత్యేక సంచికను తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ బాష , డాక్టర్ దినేష్ కుమార్ రెడ్డి. ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు సయ్యద్ సుహేల్, అయాన్, నగర ఉపాధ్యక్షులు ఆబిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

కడప కోటిరెడ్డిసర్కిల్ : స్టేట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కడప జోన్ తరఫున కడప డిపోలో పనిచేస్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవిని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తనకు ఈ అవకాశం ఇచ్చిన స్టేట్ ప్రెసిడెంట్ తీగల వెంకటేశ్వరరావు, సెక్రటరీ అంకినీడు, జోనల్ ప్రెసిడెంట్ రఘునాథరెడ్డి, జోనల్ సెక్రటరీ నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రవిని ఘనంగా సత్కరించారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహిళా చట్టాలతోపాటు యాప్‌లపై బాలికలు అవగాహన పెంచుకోవాలని మహిళా డీఎస్పీ బాలస్వామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో శక్తి యాప్ వినియోగం, ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎలాంటి క్లిష్ట పరిస్థితులు వచ్చినా భయపడకుండా ఎదుర్కొనేలా సిద్ధం కావాలని సూచించారు. ఆపదలో 112, సైబర్ నేరాలు జరిగినప్పుడు 1930, ఉమెన్ హెల్ప్ లైన్, బాల్య వివాహాలకు 181, చిన్న పిల్లల రక్షణ, భద్రతకు 1098, డ్రగ్స్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీరసుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు నాగేంద్ర, షరీఫ్, మహిళా ఎస్ఐ శాంతమ్మ, శక్తిటీం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఎంఆర్సీ ముట్టడిస్తాం

కడప ఎడ్యుకేషన్: కడప మండల పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 30వ తేదీ ఎంఆర్సీని ముట్టడిస్తామని ఉపాధ్యాయ సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ విషయమై సోమవారం కడప ఆర్జేడీ శామ్యూల్‌ను, డీఈఓ షేక్ షంషుద్దీను కలిసి వారు వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప మండల గత ఎంఈఓ వైఖరిపై వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారన్నారు. మండలంలోని దాదాపు నాలుగు వందల పైబడి ఉపాధ్యాయుల ఇంకమ్ టాక్స్‌కు సంబంధించి టీడీఎస్ నాలుగు త్రైమాసికాలు పెండింగ్‌లో ఉండడం వలన ప్రస్తుతం ఉపాధ్యాయులు ఈ ఫైలింగ్ చేసుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. ఇంకా పలు సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈ నెల 30వ తేదీన కడప ఎంఆర్సీని ముట్టడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఖాదర్ బాషా, ఎస్ టీయు నాయకులు చెన్నకేశవరెడ్డి, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, ఎయిడెడ్ పాఠశాలల నాయకులు బాలశౌరి రెడ్డి, నరసారెడ్డి, వైయస్సార్ టీఎఫ్ నాయకులు రమణారెడ్డి, మున్సిపల్ టీచర్స్ నాయకులు రవి శంకర్ రెడ్డి, సంజీవ్, అనిల్, చలపతి రాజు, నరసింహారావు, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

వితరణ



మానవత సంస్థకు బాడీ ఫ్రీజర్‌ను అందజేస్తున్న దాతలు

కడప సెవెన్‌రోడ్స్ : కడప పట్టణంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో లోమడ సతీష్ రెడ్డి, శిల్పారెడ్డి (అమెరికాలో నివాసం ఉంటున్న) వారి తల్లి దివంగత లోమడ సుబ్బలక్ష్మమ్మ, ప్రముఖ సంఘ సేవకురాలు, రాష్ట్ర వికలాంగుల సంస్థ చైర్మన్ పద్మావతి మహిళా మండలి అధ్యక్షురాలు, వృద్ధాశ్రమాన్ని నిర్మించి వృద్ధులకు ఎన్నో సేవా కార్యక్రమాలు కొనసాగించారు. ఎన్నారై సతీష్ రెడ్డి తన తల్లిదండ్రులు దివంగత సుబ్బలక్షుమ్మ, సుబ్బారెడ్డిల జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్ ను మానవతకు అందించారు. ఇంటాక్ కన్వీనర్ లయన్ చిన్నప్ప రెడ్డి, వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి చేతుల మీదుగా బాడీ ఫ్రీజర్ బాక్స్ ను మానవత సేవా సంస్థకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు ఆచార్య జి సాంబశివరెడ్డి, సెంట్రల్ కమిటీ డైరెక్టర్లు డాక్టర్ అవటాల రామాంజుల రెడ్డి, రాటాల గోపి, శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ వెంకటరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.